సాక్షి
ప్రకాశం
శనివారం । 12 । అక్టోబర్ । 2024



దసరా కాదు.. బురిడీ

రేషన్ షాపుల ద్వారా కందిపప్పు విక్రయాలు చేయని కూటమి ప్రభుత్వం దసరా పండుగ వేళ తక్కువ ధరకు సరుకులంటూ హడావుడి చేస్తోంది.

- 6లో..



అలుగును చంపిన కేసులో ఆరుగురు అరెస్టు

అలుగును చంపిన కేసులో అనుమానితులుగా ఉన్న ఆరుగురిని పోలీసులు అరెస్టు చేశారు.

- 6లో..

గరిష్టం/కనిష్టం
30/27

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల ఉరుములు మెరుపులతో జల్లులు పడవచ్చు.

న్యూస్‌రీల్

ప్రజలకు విజయ దశమి శుభాకాంక్షలు



దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి

ఒంగోలు సిటీ: చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా భావించే విజయదశమి పండుగను ప్రజలు సుఖసంతోషాలతో, ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని పలువురు ప్రజాప్రతినిధులు ఆకాంక్షించారు. దుర్గామాత ఆశీస్సులు అందరికీ ఉండాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, వైపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్, మాజీ మంత్రులు ఆదిమూలపు సురేష్, మేరుగు నాగార్జున శుక్రవారం వేర్వేరు ప్రకటనల్లో పేర్కొన్నారు. జిల్లా ప్రజలందరికీ విజయాలు దక్కాలని కోరుకుంటున్నట్లు పేర్కొన్నారు.

జిల్లా ప్రజలకు ఎస్పీ దసరా శుభాకాంక్షలు



ఒంగోలు టౌన్: జిల్లా ప్రజలకు ఎస్పీ ఏఆర్ దామోదర్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పోలీసు అధికారులకు, సిబ్బందికి , ప్రజలకు ప్రత్యేకంగా పండుగ శుభాకాంక్షలు తెలిపారు.



గంటాయపాలెం పార్వతీదేవి కళారం ఊరేగింపులో భక్తులు



లక్ష్మీ నరసింహస్వామి కళారం



మస్తాన్‌దర్గా సెంటర్‌లో కళారాల ఊరేగింపు



గంటాయపాలెం పార్వతీదేవి కళారం



మహిషాసుర మర్దినిగా గొడుగుపాలెం కనకదుర్గాదేవి అమ్మవారు

దుర్గతి నాశిని.. సద్గతి దాయిని

దుర్గతులను నశింపజేసి.. సద్గతులు ప్రాప్తింపజేసే ఆ ఆదిపరాశక్తి మహిషాసురమర్దినిగా భక్తులకు దర్శనమిచ్చారు. దసరా శరన్నవరాత్రి మహోత్సవాల్లో 9వ రోజు శుక్రవారం జిల్లాలోని పలు ఆలయాల్లో అమ్మవారిని మహిషాసురమర్దినిగా అలంకరించారు. నగరంలో కళారాల మహోత్సవం కన్నుల పండువగా సాగింది. వివిధ దేవతామూర్తుల కళారాలను నగర వీధుల్లో ఊరేగించారు. వేలాది మంది భక్తజనం కళారోత్సవంలో పాల్గొన్నారు.

- సాక్షి నెట్‌వర్క్

లిక్కర్.. లెక్కతప్పింది

మద్యం దుకాణాల కేటాయింపును ఆద్యంతం పారదర్శకంగా జరుగుతుందంటూ ప్రభుత్వ పెద్దల నుంచి అధికారుల వరకు గొప్పలు పోయారు. నేలవిడిచి సాము చేసి దరఖాస్తులు వేయించేందుకు ఆపసోపాలు పడ్డారు. చివరకు అనుకున్నంత స్థాయిలో దరఖాస్తు చేయించలేకపోయారు. మద్యం దుకాణాలకు విదేశాల నుంచి కూడా దరఖాస్తులు వేస్తున్నారంటూ ప్రచారం చేసినా.. టీడీపీ నేతల బెదిరింపులు, వ్యాపారాల్లో వాటాలతో వ్యాపారులు వెనుకాడారు. సగటున ఒక్కొక్క దుకాణానికి 20 దరఖాస్తులు కూడా రాని పరిస్థితి నెలకొంది.

- జిల్లాలో 171 దుకాణాలకు 3,405 దరఖాస్తులే
- 5,130 దరఖాస్తుల లక్ష్యంగా ఎక్సైజ్ ఆపసోపాలు
- టీడీపీ నేతల బెదిరింపులు, వాటాలతో భయపడిన వ్యాపారస్తులు
- అర్ధరాత్రి వరకూ దరఖాస్తుకు ఆఫర్
- విదేశాల నుంచి దరఖాస్తులంటూ గొప్పలు
- నగటున దుకాణానికి 19 దరఖాస్తులు



సాక్షి ప్రతినిధి, ఒంగోలు: మద్యం దరఖాస్తులకు గడువు ముగిసిపోయింది. నూతన మద్యం పాలసీలో తొలి అంకం ముగిసింది. అధికార పార్టీ నేతల తీరుతో ప్రభుత్వం లెక్కతప్పింది. జిల్లాలో 171 దుకాణాలకు 5,130 దరఖాస్తులు వచ్చేలా చూటాడలని టార్గెట్ పెట్టుకుంది. శుక్రవారం సాయంత్రానికి 3405 మాత్రమే వచ్చాయి. క్షేత్రస్థాయిలో అధికారులు ప్రెస్‌మీట్లు పెట్టారు. వ్యాపారస్తులకు ఫోన్లు చేశారు. ''రండి..మేమున్నాము కదా..మీకేం కాదు..దరఖాస్తులు చేసుకోండి'' అంటూ కోరినా పెద్దగా స్పందన కనిపించలేదు.

ఈ నెల 1వ తేదీ నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైంది. ఆన్‌లైన్ విధానం ద్వారా ఇంటినుంచైనా సరే దరఖాస్తు చేసుకునే వెసులుబాటు కల్పించారు. తొలుత ఈ నెల 9వ తేదీ వరకు గడువు విధించారు. అప్పటికీ అనుకున్న మేర దరఖాస్తులు రాలేదు. మళ్లీ రెండు రోజులు గడువు పెంచారు. అయినా స్పందన కనిపించలేదు. ఇక లాభంలేదనుకున్నారో ఏమోకానీ విదేశాల నుంచి సైతం దరఖాస్తులు వచ్చాయంటూ ఊదరగొట్టారు. అయినా పెద్దగా స్పందన కానరాలేదు. జిల్లాను ఒంగోలు, మార్కాపురం డివిజన్లుగా విభజించి మద్యం దుకాణాలు కేటాయించారు. ఒంగోలు డివిజన్లో ఒంగోలు, చీమకుర్తి, సింగరాయకొండ, పొదిలి, దర్శి ఉన్నాయి. మార్కాపురం డివిజన్లో మార్కాపురం, కనిగిరి, గిద్దలూరు, కంభం, యర్రగొండపాలెం ప్రాంతాలు ఉన్నాయి. ఈ రెండు డివిజన్లు కలుపుకొని మొత్తం 171 మద్యం దుకాణాలు ఏర్పాటు చేయాలని అధికారులు నిర్ణయించారు. ఒక్కో దుకాణానికి గాను కనీసం 30 ప్రకారం కనీసం 5 వేల దరఖాస్తులను ప్రభుత్వం టార్గెట్‌గా పెట్టుకుంది. 12 రోజుల పాటు దరఖాస్తులు స్వీకరించినా నేటికీ 3405 మాత్రమే వచ్చాయి. సింగిల్ డిజిట్ దరఖాస్తులు వచ్చిన మద్యం దుకాణాలు సైతం ఎక్కువగా ఉన్నాయి.

ప్లీజ్ దరఖాస్తు చేయండి..

మద్యం దుకాణాలకు దరఖాస్తు చేసుకోవాల్సిందిగా అధికారులు పాత మద్యం వ్యాపారులకు రిక్వెస్ట్ ఫోన్లు చేయిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఎలాగైనా సరే టార్గెట్ పూర్తి చేయాలని పట్టుదలగా ఉన్న ప్రభుత్వం క్షేత్ర స్థాయి అధికారులు, సిబ్బంది ద్వారా మాట్లాడించి వారి చేత కూడా దరఖాస్తులు చేయిస్తున్నట్లు చెప్పుకుంటున్నారు. ''మీరు దరఖాస్తు చేయండి..మీకు ఎలాంటి ఇబ్బంది రాకుండా మిగిలిన విషయం మేం చూసుకుంటాం'' అని కోరుతున్నట్టు తెలిసింది. టీడీపీ కేడర్ చేత కూడా దరఖాస్తు చేయిస్తున్నారని సమాచారం. అదే పనిగా కేడర్ కు ఫోన్ చేసి నచ్చచెప్పి మద్యం వ్యాపారంలో దించుతున్నారని చెప్పుకుంటున్నారు.

ఆఫ్‌లైన్ దరఖాస్తులకు భయపడి..

''రాష్ట్రంలో ప్రభుత్వం మాది, మొత్తం మద్యం దుకాణాలు మావే'' అంటూ తెలుగు దేశం నాయకులు చేసిన రచ్చ, బెదిరింపులతో ఆఫ్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకునేందుకు వ్యాపారులు భయపడి పోయారని చెప్పవచ్చు. జిల్లాలోని 171 దుకాణాలకు ఇప్పటి వరకు 3405 దరఖాస్తులు రాగా అందులో 400 దరఖాస్తులు మాత్రమే ఆఫ్‌లైన్లో రావడం దీనికి ప్రత్యక్ష ఉదాహరణగా పేర్కొనవచ్చు. మండలాల్లో ఎవరైనా మద్యం దుకాణాలకు దరఖాస్తు చేసుకునేందుకు వస్తే అక్కడ కాపు కాసిన టీడీపీ శ్రేణులు, ఎక్సైజ్ కానిస్టేబుళ్ల ద్వారా ముఖ్య నాయకుడి అనుచరుడికి సమాచారం వెళ్లేదని, వెంటనే దరఖాస్తు చేసుకున్న వారికి హెచ్చరికలు జారీ చేసేవారని తెలుస్తోంది.

అర్ధరాత్రి వరకు ఆన్‌లైన్ దరఖాస్తులు...

శుక్రవారం రాత్రి మాత్రం అర్ధరాత్రి వరకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించారు. ''మా దగ్గర డబ్బులు లేవంటే ...పర్వాలేదు ముందు దరఖాస్తు చేసుకోండి, ఆ తరువాత రాత్రి 12 గంటల వరకు టైం ఉంది కదా , ఆ లోపు డబ్బులు చెల్లించండి'' అంటూ ఆఫర్ ఇచ్చారు.

20:20తో వ్యాపారం ఎలా..

మద్యం రిటైల్ వ్యాపారులకు రాష్ట్ర ప్రభుత్వం 20 శాతం మార్జిన్ ఇస్తామని చెబుతోంది. జిల్లాలో తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యేలు 20 శాతం వాటా డిమాండ్ చేస్తున్నట్టు ప్రచారం జరుగుతోంది. మరి రిటైల్ దుకాణదారుడికి వచ్చేది ఏమిటన్న ప్రశ్న వేధిస్తోంది. ఒక్కో దుకాణానికి గాను రూ.1.50 నుంచి రూ.2 కోట్ల వరకు ఖర్చు చేసి ఎలాంటి లాభం లేకపోతే ఎందుకు వ్యాపారం చేయాలని ఆలోచనలో పడినట్లు చెబుతున్నారు. ఈ లెక్కన ఎంఆర్‌పీ కంటే కనీసం 20 నుంచి 30 శాతం అధిక ధరలకు మద్యం విక్రయిస్తేనే వ్యాపారం చేయగలిగే పరిస్థితి ఉంటుందని కొందరు వ్యాపారులు చెప్పుకుంటున్నారు.

టీడీపీ నేతల బెదిరింపులతో
మహిళ ఆత్మహత్యాయత్నం

- ప్రేమ పేరుతో వంచించి బాలికను గర్భిణిని చేసిన టీడీపీ నాయకుడి కుమారుడు
- చెప్పినట్లు రాజీకి రాకపోతే బజారుకీడుస్తానంటూ బెదిరింపులు
- భయపడి బాలిక తల్లి ఆత్మహత్యా యత్నం
- ఒంగోలులోని ఒక ప్రైవేటు వైద్యశాలలో ప్రాణాలతో పోరాటం
- దర్శి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి అండతోనే అబ్బాయి తండ్రి రెచ్చిపోతున్నాడంటూ బాలిక తండ్రి ఆరోపణలు
- తమ కుటుంబానికి న్యాయం చేయాలంటూ ప్రభుత్వానికి వేడుకోలు

ఒంగోలు టౌన్: ప్రేమపేరుతో వెంటపడి పెళ్లి చేసుకుంటానని నమ్మబలికి ఒక బాలికను గర్భిణిని చేశాడు దర్శి నియోజకవర్గానికి చెందిన టీడీపీ నాయకుడి కుమారుడు. తమకు న్యాయం చేయమంటూ వేడుకున్న బాధిత బాలిక కుటుంబ సభ్యులపై బెదిరింపులకు దిగడంతో భయాందోళనకు గురైన బాలిక తల్లి ఆత్మహత్యా యత్నం చేసింది. ప్రస్తుతం ఒంగోలులోని ఒక ప్రైవేటు వైద్యశాలలో చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతోంది. బాధిత బాలిక తండ్రి కథనం ప్రకారం.. కావలికి చెందిన దంపతులకు ఇద్దరు కుమార్తెలు. పెద్ద కుమార్తె కావలిలోని ఒక ప్రైవేటు కళాశాలలో ఇంటర్మీడియెట్ చదువుతుండగా, చిన్న కుమార్తె దర్శి సమీప గ్రామంలో అమ్మమ్మ దగ్గర ఉంటూ 7వ తరగతి చదువుకుంటోంది. కొద్దిరోజులుగా గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు ఏనిగంటి కోటేశ్వరరావు కుమారుడు వరుణ్ చౌదరి ప్రేమ పేరుతో బాలిక వెంటపడ్డాడు. పెళ్లి చేసుకుంటానని నమ్మించాడు. శారీరకంగా లోబరుచుకొని గర్భిణిని చేశాడు. ఈ విషయం తెలిసిన బాలిక తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. గత ఆగస్టులో దర్శి పోలీసులు పోక్సో కేసు నమోదు చేసి వరుణ్ చౌదరిని అరెస్టు చేశారు.

రూ.50 వేలు ఇస్తా తీసుకొని వెళ్లు ...

బాలికను గర్భిణిని చేసిన వరుణ్ చౌదరి తండ్రి కొద్ది రోజులుగా రాజీ ప్రయత్నాలు చేయడం మొదలు పెట్టాడని బాలిక తండ్రి చెబుతున్నారు. రాజంపల్లికి చెందిన తెలుగుదేశం నాయకులను మధ్యవర్తులుగా రాయబారానికి పంపించాడన్నారు. వారి ద్వారా డబ్బులు ఇస్తానంటూ ఆశ పెట్టాడని, అయితే ఇందుకు అంగీకరించలేదని, తమకు డబ్బులు ఏమీ వద్దని, తమ కూతురిని పెళ్లి చేసుకోవాలని కోరామన్నాడు. దాంతో అగ్గిమీద గుగ్గిలమైన కోటేశ్వరరావు రూ.50 వేలు ఇస్తా, తీసుకొని పోండి. పెళ్లి అంటే ఎదురు కేసు పెట్టి బాలికను, బాలిక తల్లిని బజారుకీడుస్తానంటూ రెచ్చి పోయాడని ఆరోపించాడు. చెప్పినట్లు విని రాజీకి వస్తే సరేసరి లేకపోతే ఇబ్బందులు పడతావంటూ బెదిరింపులకు దిగాడన్నాడు. ఈ క్రమంలో కొందరు గుర్తు తెలియని వ్యక్తులు కావలిలో తన ఇంటిపై దాడి చేసి కొట్టారాని వాపోయాడు. కేసులో రాజీ పడాలని, లేకుంటే నిన్ను, నీ భార్యను చంపుతామని బెదిరించి వెళ్లారని ఆరోపించాడు. వెంటనే బాలిక తండ్రి కావలి వన్‌టౌన్ సీఐకు ఫోన్ చేసి జరిగిన విషయం చెప్పామన్నాడు. వెంటనే ఎస్సై వచ్చి జరిగిన విషయం అడిగి తెలుసుకుని, చుట్టుపక్కల విచారించి వెళ్లారని తెలిపాడు.

బాలిక తల్లి ఆత్మహత్యా యత్నం..

ఈ ఘటనలతో బాలిక తల్లి భయాందోళనకు గురైంది. ఈ నెల 2వ తేదీ ఎలుకల మందు తిని ఆత్మహత్యకు ప్రయత్నించింది. వెంటనే ఆమెను కావలి ఆస్పత్రికి తరలించి వైద్యం చేశారు. మెరుగైన చికిత్స కోసం శుక్రవారం ఒంగోలులోని ఒక ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. ఆమెను ఎమర్జెన్సీ వార్డులో ఉంచి కృతిమ శ్వాస అందిస్తున్నారు. పరిస్థితి విషమంగా ఉందని, లివర్ చెడిపోయిందని, ప్లేట్‌లెట్స్ కూడా తగ్గిపోతున్నాయని, రక్తపోటు తరచుగా పడిపోతుందని వైద్యులు తెలిపారు. ఒకవైపున నిండా పద్నాలుగేళ్ల వయసు కూడా లేని కుమార్తె నిండు గర్భంతో ఉంది. చిన్న వయసు కావడంతో కాన్పు ప్రమాదం కావచ్చని, సిజేరియన్ చేసినా ప్రాణాలకు ముప్పు రావచ్చని వైద్యులు చెబుతున్నారని, మరోవైపు ఆత్మహత్యా యత్నం చేసిన భార్య చావు బతుకుల మధ్య పోరాడుతోందని బాలిక తండ్రి కన్నీటి పర్యంతమయ్యారు. ప్రభుత్వం తమకు న్యాయం చేయాలని వేడుకుంటున్నారు. దర్శి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి అండ చూసుకునే కోటేశ్వరరావు రెచ్చి పోతున్నాడని ఆరోపిస్తున్నారు.

కానిస్టేబుల్‌ను పరామర్శిస్తున్న ఎస్పీ దామోదర్



కానిస్టేబుల్ రవికుమార్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుంటున్న ఎస్పీ దామోదర్

ఒంగోలు టౌన్: కనిగిరి ట్రాఫిక్ విధుల్లో ఉండగా అకస్మాత్తుగా అనారోగ్యం పాలై ప్రస్తుతం ఒంగోలులోని ఒక కార్పొరేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కానిస్టేబుల్ బి.రవికుమార్ ను ఎస్పీ ఏఆర్ దామోదర్ పరామర్శించారు. మూడేళ్లుగా పెద చెర్లోపల్లి పోలీసు కానిస్టేబుల్‌గా విధులు నిర్వహించిన ఆయన ఇటీవలే కనిగిరి ట్రాఫిక్ కానిస్టేబుల్‌గా బదిలీ అయ్యారు. ఈ నెల 8వ తేదీ ట్రాఫిక్ విధుల్లో ఉండగా ఒక్కసారిగా రోడ్డు పక్కన పడిపోయారు. పక్కనే ఉన్న పోలీసు సిబ్బంది ఆయనను కనిగిరిలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. హై బీపీతో మెదడులో రక్తంగడ్డ కట్టినట్లు నిర్ధారించిన వైద్యులు మెరుగైన చికిత్స కోసం ఒంగోలులోని కార్పొరేట్ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన ఇంకా స్పృహలోకి రాలేదు. ఈవిషయం తెలుసుకున్న ఎస్పీ శుక్రవారం ఆస్పత్రికి వెళ్లి కానిస్టేబుల్ ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఆయన కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు.

ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు డీఎస్సీ పరీక్షకు ఉచిత బోధన

ఒంగోలు సిటీ: ఏపీ ప్రభుత్వం సాంఘిక సంక్షేమశాఖ ఉత్తర్వుల మేరకు రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు డీఎస్సీ పరీక్షకు ఉచిత బోధన నిర్వహించనున్నట్లు సాంఘిక సంక్షేమ శాఖ డీడీ ఎన్.లక్ష్మానాయక్ శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా డీడీ లక్ష్మానాయక్ మాట్లాడుతూ ఉచిత బోధన తో పాటు ఉచిత భోజన, వసతి సౌకర్యాలతో 3 నెలల పాటు అభ్యర్థులు శిక్షణ పొందేందుకు http://jnanabhumi.ap.gov.in ఆన్‌లైన్ వెబ్‌సైట్ ద్వారా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

డీపీవో కార్యాలయం పూర్వపు ఏవోపై సస్పెన్షన్ వేటు

ఒంగోలు అర్బన్: జిల్లా పంచాయతీ కార్యాలయంలో మొన్నటి వరకు ఏవోగా విధులు నిర్వహించిన శివప్రసాద్‌పై సస్పెన్షన్ వేటు పడింది. ప్రస్తుతం ఆయన ఇటీవల జరిగిన బదిలీల్లో కందుకూరు డీఎల్‌పీవోగా బదిలీ అయ్యారు. డీపీవో కార్యాలయంలో బదిలీల అంశంలో అవకతవకలు, అక్రమాలు జరిగాయనే ఆరోపణలపై ఆ శాఖ కమిషనర్ కార్యాలయం నుంచి ఏవోను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటికే బదిలీలపై వచ్చిన ఆరోపణలకు సంబంధించి జూనియర్ అసిస్టెంట్ ఒకరు సస్పెండ్ అయ్యారు.

నాణ్యమైన మద్యం తాగితే
అనారోగ్యం రాదా..?

- వైఎస్సార్‌సీపీ పీఏసీ సభ్యుడు, మాజీ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్



సింగరాయకొండ: టీడీపీ కూటమి ప్రభుత్వం నాణ్యమైన మద్యం ఇస్తామని చెబుతోందని, ఈ మద్యం తాగితే అనారోగ్య సమస్యలు రావా అని వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యుడు, కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. జరుగుమల్లి మండలంలో పలు కార్యక్రమాల్లో పాల్గొనేందుకు శుక్రవారం ఆయన వావిలేటిపాడు గ్రామం వచ్చిన సందర్భంగా విలేకరులతో మద్యం టెండర్లపై మాట్లాడారు. రాష్ట్రంలో మద్యం టెండర్ల ద్వారా టీడీపీ నాయకుల అరాచకపాలన బట్టబయలైందన్నారు. మద్యం టెండర్ల విషయంలో ప్రతి ఎమ్మెల్యే వీధి రౌడీలా మారి తాము చెప్పిన వారే టెండర్లు వేయాలని, ఒక వేళ వేసినా షాపు నిర్వహించకుండా అడ్డుకుంటామని, షాపు మాకు అప్పగించాల్సిందే.. అని బెదిరిస్తున్నారన్నారు. మరో వైపు సీఎం చంద్రబాబు పార్టీ నాయకులు అవినీతికి పాల్పడితే సహించేది లేదని సన్నాయి నొక్కులు నొక్కుతున్నారన్నారు. మరొకతనేమో సనాతన ధర్మమని తిరుగుతాడు వీళ్లేమో అరాచకపాలన సాగిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజలు వీరు చేస్తున్న అరాచక పాలనను గమనిస్తున్నారన్నారు. రాష్ట్రంలో అరాచక పాలనను వైఎస్సార్ సీపీ కచ్చితంగా అడ్డుకుంటుందని హెచ్చరించారు. తమ పార్టీ ఎల్లప్పుడూ మద్యపాన నిషేధానికి కట్టుబడి ఉందన్నారు. మద్యపాన నిషేదాన్ని అమలు చేసిన నాయకుడు ఎన్టీఆర్ అని కొనియాడారు.

కూటమి ప్రభుత్వం అన్నీ విధాలా మోసగించింది

- వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి జూపూడి ప్రభాకరరావు



వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయాన్ని పరిశీలిస్తున్న జూపూడి ప్రభాకరరావు

ఒంగోలు సిటీ: చంద్రబాబు కూటమి ప్రభుత్వం ప్రజలను అన్నీ విధాలా మోసం చేసిందని మాజీ ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి జూపూడి ప్రభాకరరావు అన్నారు. నూతనంగా నిర్మించిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయానికి శుక్రవారం వచ్చిన ఆయన మాట్లాడుతూ జిల్లాలో అధునాతన వసతులతో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయం ఏర్పాటు చేసినందుకు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ సంక్షేమ పథకాలు అమలు చేయకపోగా, నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలలో సిక్సలు కొడుతోందని ఎద్దేవా చేశారు. సంక్షేమ పథకాల అమలులో కూటమి ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందని విమర్శించారు. కేవలం టీడీపీ నాయకులే సిండికేట్ అయి మద్యం షాపులను దక్కించుకొని ప్రభుత్వ ఆదాయాన్ని గండికొడుతున్నారని విమర్శించారు. కార్యక్రమంలో సాంస్కృతిక విభాగం జోనల్ ఇన్‌చార్జ్ బొట్లా సుబ్బారావు, 14వ డివిజన్ కార్పొరేటర్ ఇమ్రాన్‌ఖాన్, వైఎస్సార్‌సీపీ నాయకులు కుట్టుబోయిన కోటి యాదవ్, పిగిలి శ్రీను, ఆనం శ్రీను,రాము, వెలుగొండారెడ్డి, కాశీరెడ్డి, తిరుమలరాజు, శ్రీనివాసరాజు, నాగరాజు, షరీఫ్, మీరావలి, మురళి, సన్నిబోయిన బ్రహ్మయ్య, చిన్నా పాల్గొన్నారు.

క్లుప్తంగా

బంగారు చైన్ అపహరణ


టంగుటూరులో విచారిస్తున్న ఎస్సై నాగమల్లీశ్వరరావు

టంగుటూరు: ఓ మహిళ మెడలో గుర్తుతెలియని ఇద్దరు వ్యక్తులు బంగారం చైన్ అపహరించుపోయిన సంఘటన టంగుటూరులో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. టంగుటూరుకు చెందిన పమిడి రంగమ్మ అనే మహిళ పోలేరమ్మ గుడికి వెళ్లి తిరిగి ఇంటికి వెళ్తున్న సమయంలో విష్ణాలయం గుడి సమీపంలో గుర్తుతెలియని ఇద్దరు వ్యక్తులు ద్విచక్రవాహనంపై ఎదురయ్యారు. ఏదో అడ్రస్ అడుగుతున్నట్లు నటించి మహిళ మెడలో ఉన్న మూడు సవర్ల బంగారు చైన్ తెంపుకొని ఉడాయించారు. లబో దిబోమన్న ఆ మహిళ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. వెంటనే ఒంగోలు డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు, సింగరాయకొండ సీఐ చావా హజరత్తయ్య పర్యవేక్షణలో ఎస్సై నాగమల్లీశ్వరరావు సంఘటనా స్థలానికి చెరుకొని వివరాలు సేకరించారు. ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గాలిస్తున్నారు.

మంట కలిసిన మానవత్వం

- కాలువలో పసికందు మృతదేహం


మార్కాపురం: అప్పుడే పుట్టిన పసికందు తల్లిపొత్తిళ్లలో ఉండాల్సింది పోయి మురికి కాలువలో నిర్జీవంగా పడి ఉన్న అమానవీయ ఘటన ప్రకాశం జిల్లా మార్కాపురం పట్టణంలో శుక్రవారం వెలుగులోకి వచ్చింది. స్థానికుల సమాచారం ప్రకారం.. కంభం రోడ్డులోని మురికి కాలువలో అప్పుడే పుట్టిన పసికందు మృతదేహం లభించింది. ఎవరు చేసిన పాపమో తెలీదు కానీ కళ్లు తెరిచేలోపు అమ్మ పక్కన ఉండాల్సిన శిశువు మురికి కాలువలో మృతిచెంది ఉండటాన్ని పలువురు గుర్తించి మున్సిపాలిటీ అధికారులకు సమాచారం ఇచ్చారు.

అంబరాన్నంటిన సంబరాలు


త్రిపురాంతకం: సిద్ధిదాయనిగా అశ్వవాహనంపై శ్రీబాలాత్రిపురసుందరీదేవి


పీసీపల్లిలో మహిషాసుర మర్దినిగా అమ్మవారు


ముండ్లమూరు మండలం మారెళ్లకాళికా దేవిగా..


మహిషాసురమర్దిని అలంకరణలో బాలాజీరావుపేట కనకదుర్గాదేవి అమ్మవారు

శరన్నవరాత్రుల్లో భాగంగా దసరా ఉత్సవాలు వైభవోపేతంగా సాగుతున్నాయి. శుక్రవారం దేవిని అలంకరించి విశేష పూజలు నిర్వహిస్తున్నారు. మహిళా భక్తులు ఉదయాన్నే లేచి ఆలయాలను సందర్శిస్తున్నారు. పలు చోట్ల అన్నదానం నిర్వహిస్తున్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరిస్తున్నాయి.

-సాక్షి, ఒంగోలు


పెద్దదోర్నాలలో శ్రీ మహా చండీదేవి అలంకారంలో అమ్మవారు


ఒంగోలు: మహిషాసురమర్ధిని అలంకరణలో కేశవస్వామిపేట విజయదుర్గాదేవి


ఒంగోలు: మహిషాసురమర్ధిని అలంకరణలో కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలోని అన్నపూర్ణాదేవి


ఒంగోలు: కాళికాదేవి అలంకరణలో అచలానందాశ్రమంలోని గోవిందమాంబ అమ్మవారు

గొర్రెల దొంగతనం కేసులో ముగ్గురు అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న సీఐ రామారావు

దర్శి: గొర్రెల దొంగతనం కేసులో ముగ్గురు దొంగలను అరెస్ట్ చేసినట్లు సీఐ వై. రామారావు తెలిపారు. స్థానిక సర్కిల్ ఆఫీసులో శుక్రవారం వివరాలను వెల్లడించారు. నిందితులు దర్శి, ముండ్లమూరు, బేస్తవారి పేట, నాగులుప్పలపాడు పోలీస్ స్టేషన్‌ల పరిధిలో 129 గొర్రెలను తస్కరించారు. వాటిని ఇతర ప్రాంతాలకు తీసుకుని వెళ్ళి అమ్మేయడం వారి పని. ఈ క్రమంలో ముండ్లమూరు మండలం పులిపాడు సమీపంలో ముండ్లమూరు ఎస్సై తన సిబ్బందితో కలిసి వారిని చాకచక్యంగా పట్టుకుని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. వారి వద్ద ఉన్న రూ.2.05 లక్షల సొత్తు రికవరీ చేసినట్లు చెప్పారు. నంద్యాల జిల్లాకు చెందిన పెనుగొండ కుళాయప్ప, ఎరుకలి చిన్న ఆంజనేయులు, దేవరకొండ రమేష్‌లు పులిపాడు శివారులో ఉండగా పట్టుకున్నారన్నారు. దొంగిలించిన గొర్రెల తాలూకా సొత్తును వారి వద్ద నుంచి స్వాధీనం చేసుకుని.. కోర్టులో హాజరు పరుస్తున్నట్లు తెలిపారు. దర్శి ఎస్‌డీపీఓ బి. లక్ష్మీ నారాయణ పర్యవేక్షణలో దర్శి , ముండ్లమూరు ఎస్సైలు సహకరించారు. కేసులో ప్రతిభ కనపరిచిన ఎస్సైలను ఎస్పీ దామోదర్ అభినందించారు.

పోరాటానికి సిద్ధం కావాలి


వర్గీకరణ వ్యతిరేక పోరాటం వివరిస్తున్న బిళ్లా చెన్నయ్య

ఒంగోలు సిటీ: ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాటం చేయడానికి తమ వంతు కృషి చేయాలని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు బిళ్లా చెన్నయ్య అన్నారు. శుక్రవారం మార్కాపురం, గిద్దలూరు నియోజక వర్గాల్లో తిరిగి క్రిమిలేయర్ గురించి, వర్గీకరణ వలన జరిగే నష్టాల గురించి వివరించారు. జనాభా దామాషా ప్రకారం ఎస్సీలకు సంబంధించిన రిజర్వేషన్ కేటాయించాలని సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం కులగణన చేసి వర్గీకరణ చేయాలన్నారు. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం చేయకపోతే రాష్ట్ర ప్రభుత్వాలు సుప్రీం కోర్టుకు రావాలని తెలిపిందన్నారు. దీనిని సీఎం చంద్రబాబు గుర్తుంచుకోవాలని తెలిపారు. ఎస్సీలకు 25 శాతం రిజర్వేషన్లు పెంచాలని కేంద్రానికి లేఖ రాయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ బత్తుల వెంకటరావు, జిల్లా సెక్రటరీ బడుగు శశికుమార్, జిల్లా జాయింట్ సెక్రటరీ బి.సుబ్రహ్మణ్యం, గిద్దలూరు నియోజక వర్గ అధ్యక్షుడు సుబ్బయ్య, ప్రేమ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

రైలు కిందపడి వృద్ధుడు మృతి

తర్లుపాడు: స్థానిక రైల్వేగేట్ సమీపంలో రైలు కింద పడి వృద్ధుడు మృతి చెందిన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. రైల్వే పోలీసుల తెలిపిన వివరాల మేరకు..మృతుడు మార్కాపురం మండలం గొట్టిపడియకు చెందిన చిన్నపాపయ్య (78)గా గుర్తించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్కాపురం జీజీహెచ్‌కు తరలించారు. సంఘటనకు గల కారణాలు తెలియాల్సి ఉం

సమాజంపై అవగాహన పెంచుకోవాలి

ఒంగోలు టౌన్: నర్సింగ్ విద్యార్థులు సమాజం పట్ల సరైన అవగాహన పెంపొందించుకోవాలని, ప్రజలను చైతన్యం చేసేందుకు కృషి చేయాలని రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి చెప్పారు. రాం నగర్ లోని చైతన్య స్కూల్ ఆఫ్ నర్సింగ్‌లో శుక్రవారం అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ప్రసంగిస్తూ...నర్సింగ్ విద్యార్థులు వైద్యానికి అనుబంధంగా ఉన్న చట్టాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారిణి సుభద్ర, జిల్లా బాలల సంరక్షణ అధికారి పి.దినేష్ కుమార్, సైబర్ అండ్ సోషల్ మీడియా ఇన్‌స్పెక్టర్ సూర్యనారాయణ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

దసరా కాదు బురిడీ!


కిరాణాషాపుల వద్ద ఫ్లెక్సీ పెట్టి తక్కువ రేట్లకు విక్రయిస్తున్నట్లు ఫొటోలకు ఇచ్చిన పోజు

కురిచేడు: కూటమి ప్రభుత్వం మాయ మాటలతో గిమ్మిక్కులు చేస్తోంది. జనాలను పిచ్చివాళ్లుగా చేసేందుకు.. పేద, మధ్య తరగతి వారిని గొర్రెల్లా ఏమార్చేందుకు ఏమాత్రం వెనుకాడటంలేదు. జనమంటే నిజంగానే ప్రేమ ఉన్నట్లు ఉత్తిత్తి ఆఫర్లతో ఫొటోలకు పోజులిచ్చే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. రేషన్ షాపుల ద్వారా కందిపప్పు పంపిణీ మరిచిపోయి పండుగనాడు పప్పుకూడు తినకుండా చేసిన దగా నుంచి దృష్టి మరల్చేందుకు పక్కాగా ప్లాన్ వేసింది. పండగ రోజుల్లో సరుకులు తక్కువ ధరలకు విక్రయించాలంటూ హడావిడిగా జేసీతో తహసీల్దార్లకు శుక్రవారం ఆదేశాలు జారీ అయ్యాయి. అంతటితో ఆగకుండా పామాయిల్ లీటరు రూ. 110, సన్‌ఫ్లవర్ ఆయిల్ లీటరు రూ. 124, టమోటాలు కిలో రూ. 50, ఉల్లి కిలో రూ. 35 కు విక్రయించాలని కిరాణాషాపుల వద్ద ఫ్లెక్సీలు పెట్టించి హంగామా చేశారు. అయితే ముందస్తుగా ఎలాంటి సమాచారం లేకపోవడంతో ఇప్పటికే ఎక్కువ ధరకు వ్యాపారులు కొనుగోలు చేసి సరుకును వారి దుకాణాల్లో స్టాక్ చేసుకున్నారు. ఇప్పుడు ఉన్న పళంగా అతి తక్కువ రేట్లకు ఎలా విక్రయించగలమని వారు ప్రశ్నిస్తున్నారు. అయితే ఉన్నతాధికారుల ఆదేశాలను తప్పక అమలు చేయాలని ఆర్ఐ నాగరాజు వ్యాపారులకు సూచించారు.

భైరవకోనలో కన్నుల పండువగా మహర్నవమి

- శ్రీ లలితాదేవిగా త్రిముఖదుర్గాదేవి


భైరవకోనలో శ్రీలలితాదేవి అలంకరణలో త్రిముఖదుర్గాదేవి

సీఎస్‌పురం (పామూరు): మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం, పర్యాటక ప్రాంతం భైరవకోనలో దసరా శరన్నవరాత్రి వేడుకల్లో భాగంగా శుక్రవారం మహర్నవమి వేడుకలు ఈఓ డి.వంశీకృష్ణా రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు వెంకట నరసయ్య, రామమూర్తి, సుధాకర్‌శర్మలు త్రిముఖ దుర్గాదేవి, నగరేశ్వర, కాలభైరవ, భర్గులేశ్వర ఆలయాల్లో పూజలు చేశారు. ఆదేవిధంగా సామూహిక కుంకుమపూజ, అనంతరం చండీహోమం వేదమంత్రాలతో నిర్వహించారు. ప్రత్యేక పూజల్లో స్థానిక ఎస్సై ఆర్.సుమన్, సిబ్బంది, పలువురు నాయకులు, అధికారులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ముప్పాళ్ల శ్యామ్ సుందర్‌రాజు, పలువురు నాయకులు, భక్తులు పాల్గొన్నారు.


చండీహోమం నిర్వహిస్తున్న అర్చకులు, భక్తులు

హెచ్‌ఐవీ నిర్మూలన సాధ్యమే!

- 2030 నాటికి జీరో స్థాయికి..
- హెచ్‌ఐవీ, ఎయిడ్స్‌పై ప్రజల్లో అవగాహన కల్పించే దిశగా అడుగులు
- రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థతో కలిసి హెల్ప్ స్వచ్ఛంద సంస్థ కార్యాచరణ
- 8 వారాల పాటు ప్రత్యేక కార్యక్రమాలు
- ముగింపు కార్యక్రమంలో హెల్ప్ పీడీ బీవీ సాగర్


కరపత్రాలను ప్రదర్శిస్తున్న బీవీ సాగర్, సిబ్బంది

ఒంగోలు సబర్బన్: రాష్ట్రంలో హెచ్‌ఐవీ, ఎయిడ్స్ వ్యాధి 2030 సంవత్సరం నాటికి జీరో స్థాయికి తీసుకురావటమే లక్ష్యంగా కార్యాచరణ చేపట్టామని హెల్ప్ స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ బీవీ సాగర్ వెల్లడించారు. స్థానిక సంస్థ ప్రధాన కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో హెచ్‌ఐవీ, ఎయిడ్స్ నిర్మూలనకు 8 వారాల పాటు చేపట్టిన ప్రత్యేక కార్యక్రమాల గురించి సాగర్ వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 8 వారాల పాటు ఎనిమిది అంశాలను చేపట్టామన్నారు. హెచ్‌ఐవీ, ఎయిడ్స్‌పై నిర్వహించిన అవగాహన కార్యక్రమాలు శుక్రవారంతో ముగిశాయన్నారు. ఈ మహమ్మారిపై సమాజంలో అవగాహన పెంచాల్సిన అవసరం ఎంతనా ఉందన్నారు. ఆ లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఒక్క హెచ్‌ఐవీ కేసు కూడా నమోదు కాకుండా ఉండాలన్న లక్ష్యంతో ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ నియంత్రణ సంస్థతో కలిసి 8 వారాలపాటు ఎనిమిది అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్ళి అవగాహన కల్పించామని వెల్లడించారు. మొదటి వారం హెచ్‌ఐవీ సంక్రమించే మార్గాలు–నివారణ చర్యల గురించి వాల్‌పోస్టర్లు, కరపత్రాల ద్వారా ప్రచారం చేశామన్నారు. 2వ వారం హెచ్‌ఐవీపై అనుమానాలు, అపోహలపై, మూడో వారంలో సంక్రమించకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన, సేవల గురించి ప్రచారం నిర్వహించినట్లు పేర్కొన్నారు. 4వ వారం జాతీయ టోల్ ఫ్రీ నంబర్–1097 పై అవగాహన, అయిదో వారం సురక్షిత లైంగిక అలవాట్లు.. కాండోమ్ వాడకంపై ప్రచారంతో కూడిన అవగాహన కార్యక్రమాలు, ఆరో వారం ఎస్‌టీఐ నివారణ, చికిత్స, ఏడో వారం మద్యపానం, మాదకద్రవ్యాల వినియోగం వలన కలిగే నష్టాల గురించి, ఎనిమిదో వారంలో స్టిగ్మా.. వివక్షత అనే ఎనిమిది అంశాలపై వివరించామని తెలిపారు. ఆగస్టు 12 నుంచి రెండు నెలలపాటు మీకు తెలుసా? కార్యక్రమంలో భాగంగా ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ నియంత్రణ సంస్థతో కలిసి హెల్ప్ స్వచ్ఛంద సంస్థ బాపట్ల, ప్రకాశం జిల్లా బృందాల ఆధ్వర్యంలో విస్తృతంగా ప్రచారం చేపట్టామన్నారు. 163 అవగాహన కార్యక్రమాలు, ర్యాలీలు నిర్వహించామన్నారు. ప్రకాశం, బాపట్ల జిల్లాల హెచ్‌ఐవీ, ఎయిడ్స్ నియంత్రణ సంస్థల క్లస్టర్ ప్రోగ్రామ్ మేనేజర్‌లు సయ్యద్ జానీ బాష, పి.కిరణ్, హెల్ప్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు, చైర్మన్ ఏపీఎస్ రామ్మోహన్‌తో పాటు వివిధ ప్రభుత్వ శాఖల జిల్లా, మండల, గ్రామ స్థాయి అధికారు సహకరించారన్నారు. కార్యక్రమంలో ఐసీటీసీ కౌన్సిలర్లు, హెల్ప్ టీఐ క్షేత్రస్థాయి సిబ్బంది ఏఏఎం రాధ, ఎంఈఏ బి.భార్గవ్, ఓఆర్‌డబ్ల్యూలు కె.దుర్గ, ఎమ్.మల్లీశ్వరి, కె.క్రిష్ణవేణి, కరుణ, శ్రావణి, రూతు, పీర్ ఎడ్యుకేటర్స్ పాల్గొన్నారు.


అలుగును చంపిన కేసులో ఆరుగురు అరెస్ట్


కోర్టు వద్ద ఆందోళన చేస్తున్న కుటుంబ సభ్యులు

మార్కాపురం: యర్రగొండపాలెం మండలం వెంకటాద్రిపాలెం సమీపంలో అలుగును చంపిన కేసులో అనుమానితులుగా ఉన్న ఆరుగురిని అరెస్టుచేసి శుక్రవారం మార్కాపురం కోర్టులో హాజరుపరిచారు. అటవీశాఖ డిప్యూటీ రేంజ్ ఆఫీసరు నరసింహారావు తెలిపిన వివరాల ప్రకారం.. వెంకటాద్రిపాలెం సమీపంలో రెండు రోజుల క్రితం అలుగును చంపిన తరువాత పొలుసులను పొలాల్లో అటవీశాఖ సిబ్బంది గుర్తించారు. దీనిపై విచారణ నిర్వహించి వెంకటాద్రిపాలెంకు చెందిన నాగేశ్వరరావుతోపాటు పెద్దదోర్నాల మండలం జమ్మిదోర్నాలకు చెందిన 6గురిని గుర్తించి అరెస్టుచేసి మార్కాపురం కోర్టుకు తీసుకొచ్చారు. అయితే ఇందులో తమ తమ వారిని అటవీశాఖ సిబ్బంది అక్రమంగా అరెస్టు చేశారంటూ కోర్టువద్ద కుటుంబ సభ్యులు నిరసన తెలిపారు. దీనితో పోలీసులు, అటవీశాఖ సిబ్బంది వచ్చి సర్దిచెప్పి చట్టప్రకారమే తాము చర్యలు తీసుకున్నామని తెలిపారు. న్యాయమూర్తి నిందితులకు రిమాండ్ విధించారు.

సాక్షి Smart Economic Display ADVERTISEMENT FEATURE







సాక్షి క్లాసిఫైడ్స్

Education

■ Spot Admissions: B.A Rs.5000, B.Com-6000, B.Sc Csc/Elec-7000, M.Com/M.A English JUST-Rs.12,000, PLNM Degree College, Opp: ANU. Cont: 9177408565 [G-801091]

Real Estate

■ గుంటూరు సిటీ, గోరంట్ల, లాం, అగతవరప్పాడు, రెడ్డిపాలెం, వెనిగండ్ల, పెదకాకాని, నంబూరు, కంతేరు, కాజా మరెక్కడైనా ప్లాట్స్ అ/కొ సంప్ర। । జనచైతన్య మా ప్రత్యేకత. 7382396677 [G-977]

LAND FOR SALE

■ ఒంగోలు గానుగపాలెం, గాంధ్ల కళ్యాణ మండపం ఎదురు తూర్పు ఫేస్ ఖాళీ స్థలం 7 గదులు Rs.50 లక్షలు మొత్తంకి అమ్మబడును. వివరాలకు సంప్ర।। ✆ 94915 49969. [O-793902]

■ ఉలవపాడు (మం.) కరేడు పెద్దపల్లిపాలెం గ్రామంలో సర్వేనెం.1436లో 62 ఎకరములు స్థలం అమ్మకానికి ఉంది రొయ్యల చెరువుల కోసం స్థలం కావలసిన వారు ఈక్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించండి. ✆ 99480 52595, 91770 02538. [O-793816]

FOR SALE

■ పాకల బీచ్ DTCP మరియు RERA ఆమోదించిన ప్లాట్లు. హాలిడే వీకెండ్, TIME SHAFRE మరియు నివాస గృహాలకు అనుకూలం. 40 అడుగుల Roads, 1.5 ఎకరాల పార్క్. స్ట్రీట్ లైట్స్. సురక్షితమైన పెట్టుబడి. సంప్రదించండి : 9392132521 & 9632725303 ఇమెయిల్ : appireddyenclave@gmail.com [WB-25964]

Services

FOR SALE

■ గుంటూరు, బ్రాడీపేట, 4/13వ లైన్ లోని రన్నింగ్‌లో ఉన్న Cucumber Unisex Salon / Spa అమ్మకానికి కలదు. సంప్ర ✆ 93936 58491 [G-782833]

Wanted

■ ITI ఫైనాన్స్ లి।। ఒంగోలు బ్రాంచి నందు used కార్స్, దోస్త్ వెహికల్స్, బొలెరో పికప్ వెహికల్స్ etc., లకు ఫైనాన్స్ చేయుటకు ఫీల్డ్ ఆఫీసర్స్‌గా అనుభవం గల వారు కావలెను.అర్హతఅనుభవంబట్టి మంచి జీతం +పెట్రోల్‌బిల్+ఇన్‌సెంటీవ్స్ కలవు. Q:డిగ్రీ, ఫస్ట్ ప్రిఫరెన్స్ ఫర్ Exp. ✆ 93988 51991. [O-793906]

■ ఒంగోలు పట్టణ వివాహిత మహిళలకు (10 మందికి మాత్రమే) ప్రముఖ కంపెనీలో పర్మనెంట్ జాబ్ అవకాశం. Q:డిగ్రీ, A:30సం।।పైన జీ।। 17000/- సం।।✆ 98485 26399, 9247124530 [O-793908]

■ ఒంగోలులోని ప్రముఖ విద్యాసంస్థ నందు పనిచేయుటకు ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథ్స్, బోటని, జువాలజీ, ఇంగ్లీష్, Sanskrit, JLS కావలెను. ఉచిత వసతితోపాటు ఆకర్షణీయమైన జీతం సంప్ర।। ✆ 85003 01111, 87121 64111 [OA-322]

■ Aqua Gaurd వాటర్ ప్యూరీ ఫైయిర్ కంపెనీ ఆఫీసు ఒంగోలు నందు పనిచేయుటకు లేడీ రిసెప్షనిస్టు-1 మరియు టెక్నీషియన్స్ కావలెను. సంప్ర।। ✆ 98667 15926 [O-793904]

■ కావలెను: అనుభవం ఉన్న టెలీకాలర్స్ కావలెను. శ్రీ బాపూజీ కాంప్లెక్స్ ఒంగోలు. సంప్ర।। ✆ 89214 11713. [OA-321]

■ గోదావరి ఆంధ్ర కో-ఆపరేటివ్ సొసైటీ Ltd అన్ని బ్రాంచీలలో పనిచేయుటకు క్లర్క్స్-10, బిజినెస్ ఆఫీసర్స్-40, బ్రాంచ్ ఆఫీసర్స్-08, A.B.M-8, లోన్ ఆఫీసర్స్-40, ఏజెంట్స్ - 40M/F కావలెను. అర్హత: డిగ్రీ, పీ.జి జీతం: 13,000-22000. 8121294296, 9553294296 [G-801090]

■ ప్రముఖ నిధి బ్యాంకు నందు పని చేయుటకు సేల్స్ మేనేజర్స్ & ఫీల్డ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. జీతం : Rs.18,000/- నుండి 28,000/- వరకు + ఇన్సెంటివ్స్. సెల్ : 83282 81861. [N-1237120]

■ ప్రముఖ కంపెనీలో వర్క్ చేయుటకు స్త్రీ, పురుషులు కావలెను. Qul: 10th - డిగ్రీ, Sal: 20K - 30 K మీ అడ్రస్ వాట్సప్ చేయగలరు. వర్క్ ఫ్రం హోం అవకాశం కలదు. 8121818692. [M-1165477]

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ /నర్సులు కావలెను. ఉచిత వసతి + భోజనం. జీ: 18K. Ph: 9160900024, 9640400073 [H-796284]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

క్లాసిఫైడ్స్

ప్రతి 3 ప్రకటనలకు 2 ప్రకటనలు ఉచితం

వివరాలకు సంప్రదించండి :

క్లాసిఫైడ్స్ : ఒంగోలు 90102 02762